



# కరపత్రం

SINCE 2014

మంగళవారం సెప్టెంబర్ 29,2026 | సంపుటి : 2 | సంచిక : 351 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# కాంగ్రెస్ అభ్యర్థుల్ని రెండుసార్లు ఓడించా

- 2006లో జడ్పీటీసీ విజయం
- 2007లో ఎమ్మెల్సీగా గెలుపు
- 2009, 2014లో ఎమ్మెల్యేగా విజయం
- 2017లో కాంగ్రెస్‌లో చేరిక
- 2019లో ఎంపీగా గెలుపు
- కేసీఆర్‌తో రాజకీయ పోరు
- రాహుల్ గాంధీనే నా నాయకుడు



**ఢిల్లీ:**
ఉత్తర భారత్, దక్షిణ భారత్‌లో రాజకీయాల శైలి వేరని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అస్సాం దినపత్రిక ప్రతిదిన్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న ఆయన.. 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో విద్యార్థి సంఘాలు చాలా తక్కువగా ఉంటాయని చెప్పారు. లెఫ్ట్, రైట్ సంఘాలున్నాయని, ఎన్ఎస్‌యూఐ ప్రభావం పెద్దగా లేదని తెలిపారు. యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘంలో ఉన్నా.. గ్రామంలో మాత్రం కాంగ్రెస్‌లో ఉంటారని వ్యాఖ్యానించారు. తెలంగాణలో భాజపాకి పెద్దగా ప్రాధాన్యత లేదని, విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉందని చెప్పారు.

" నేను 2006లో జడ్పీటీసీగా.. 2007లో ఎమ్మెల్సీగా గెలిచా. ఆ రెండు సార్లు కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించా. నాడు అక్కడ కాంగ్రెస్, తెలుగుదేశం రెండు పార్టీలే ఉన్నాయి. అప్పట్లో నాకు జిల్లా కాంగ్రెస్ నేతలతో పెద్దగా సంబంధాలు లేవు. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని భావించా. అందుకే నాడు తెలుగుదేశంలో చేరా. తెదేపా నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా. అప్పుడు తెదేపా కేంద్రంలో ఎన్డీఏతో ఉంది. ఏపీలో ఎన్డీయే ఉంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. నేను రెండింటితో పోరాడాల్సి వచ్చింది.

2014 ఎన్నికల తర్వాత కేసీఆర్, రేవంత్ మధ్య పోటీగా మారింది. కేసీఆర్ నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. నేను అసెంబ్లీ కంటే జైలుకే ఎక్కువ సార్లు వెళ్లాను. నాయకత్వం ఏపీలో ఉండటంతో తెదేపాకి తెలంగాణలో ప్రాధాన్యం తగ్గింది. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ సహా శ్రేయోభిలాషులంతా కాంగ్రెస్‌లో ఉన్నారు. రాహుల్ గాంధీని కలిసి 15 నిమిషాలు మాట్లాడాం. ఆ రోజే రాహుల్ నా నాయకుడు అని నిర్ణయించుకున్నా. 2017లో కాంగ్రెస్‌లో చేరాను. 2019లో ఎంపీగా గెలిచాను. రాహుల్ గాంధీకి ఎలాంటి వ్యక్తిగత అజెండాలు లేవు. దేశమే ఆయనకు ముఖ్యం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# సీఈసీ, భాజపాపై ఉత్తమ్ ఫైర్

- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి
- ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపణ
- తెలంగాణలో 30% ఓట్లు ప్రభావితం
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి
- రాహుల్ నాయకత్వంలో పోరాటం
- 'రాహుల్ ప్రధాని కావడం ఖాయం'



**సూర్యాపేట:**
కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇష్టం లేని వారి ఓట్లను తొలగిస్తున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. సీఈసీ ద్వారా ఓటరు జాబితాను ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు. సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నిర్వహించిన ధర్నాలో మంత్రి పాల్గొన్నారు. " రాష్ట్రాల్లో ఓట్లు తొలగించి భాజపా అధికారంలోకి వస్తోంది. తొలగించిన ఓట్లు చేర్చే అవకాశం లేకుండా కుట్ర చేస్తున్నారు. తెలంగాణలో 30శాతం ఓట్లు ప్రభావితం అవుతున్నాయి. ఇలాంటి కుట్రలకు పాల్పడిన సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను తొలగించాలి. దేశంలో సీఈసీ, భాజపా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి. సీఈసీని తొలగించేంత వరకు రాహుల్ నాయత్వంలో పోరాటం చేస్తూనే ఉంటాం. ఎన్ని కుట్రలు చేసినా.. రాహుల్ ప్రధాని కావడం ఖాయం" అని ఉత్తమ్ అన్నారు.



# తెలంగాణ 'స్థానికత'పై క్లారిటీ

- నాలుగేళ్ల రూల్ తప్పనిసరి
- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- రాష్ట్రపతి ఉత్తర్వులే ఆధారం
- స్థానిక రిజర్వేషన్‌కు 4 ఏళ్ల విద్య
- పిటిషన్ డిస్మిస్ చేసిన కోర్టు
- తెలంగాణ ప్రభుత్వ జీవోకు సమర్థన

ఢిల్లీ:
తెలంగాణ 'స్థానికత' అంశంపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత ఇచ్చింది. తెలంగాణలో స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల రూల్ తప్పనిసరి అని తెలిపింది.

2లో

# రీసర్వేతో భూ సమస్యలకు చెక్



2లో

- జిల్లాకు 70 గ్రామాల్లో సర్వే
- 413 గ్రామాల్లోనూ రీసర్వే
- ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు
- జియో మ్యాప్, ఎల్‌పీఎం నంబర్
- హద్దులు, రికార్డుల సమస్యలకు పరిష్కారం
- సాదాబైనామాలపై ప్రత్యేక దృష్టి
- భూ భారతి లక్ష్యం
- : పారదర్శక రికార్డులు

తెలంగాణ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర రీసర్వే చేపడుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ భారతి కింద తొలి దశలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. నక్షాలు అందుబాటులో లేని మరో 413 గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేయనున్నట్లు చెప్పారు. ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, జియో కోఆర్డినేట్స్‌తో మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.



# ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి: సుప్రీం కోర్టు

సీబీఎస్ఈ బోర్డు పరిధిలో ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. ఈ ఏడాది 7, 8, 9వ తరగతి విద్యార్థులకు కల్పించినట్లుగానే ఈ విధానం నుంచి ఆరో తరగతికి కూడా మినహాయింపు ఇవ్వాలని ఆదేశించింది.



మిగతాది 2లో

# రూ.71.89 లక్షల మోసం

## .. 15 ఏళ్ల తర్వాత వెలుగులోకి!

- » హైదరాబాద్‌కు చెందిన అమన్‌దీప్‌పై రాజ్‌కోట్‌లో కేసు నమోదు
- »నెలకు 4 శాతం రాబడి పేరుతో మోసం చేశారంటూ ఆరోపణలు
- »నిందితుల జాబితాలో జునాగఢ్‌కు చెందిన రాజీవ్ శర్మ పేరు సైతం

హైదరాబాద్:
ఇదో చిత్రమైన కేసు... 15 ఏళ్ల క్రితం జరిగిన రూ.71.89 లక్షలకు సంబంధించిన వ్యవహారం ఇప్పుడు గుజరాత్‌లో తెరపైకి వచ్చింది.

# ఖైరతాబాద్‌లో దిమ్మతిరిగే ఫలితం!

♦ దానం నాగేందర్ సంచలనం ♦ 'సర్' ప్రభావం ఉండదు ♦ సీఈసీ రాజీనామా చేయాలి ♦ సుప్రీంకోర్టు సుమోటో తీసుకోవాలి

హైదరాబాద్:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రభావం ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉండదని మాజీ మంత్రి దానం నాగేందర్ అన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలంటూ నెక్లెస్ రోడ్డులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో దానం నాగేందర్ పాల్గొన్నారు.



2లో



2లో

# మా నేత గెలవాల్సిన సీటును సైతం కుట్రపూరితంగా చోరీ చేశారు

ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ, అమిత్ షాల వైఖరితో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని విమర్శించారు. బిహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల వెనుక అక్రమాలు ఉన్నాయని ఆరోపించారు. ఈ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలు మీడియా ముందుంచారు. ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. దేశంలో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ, అమిత్ షాల వైఖరితో ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడిందని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులా? మీరే నష్టపోతారు: కేటీఆర్



2లో

- ఫ్యూచర్ సిటీపై కేటీఆర్ ఫైర్
- రైతుల భూములపై కన్నా?
- రూ.6,000 కోట్ల భూములే కనిపిస్తున్నాయా?
- భూదందాపై తీవ్ర ఆరోపణలు
- బుల్లెట్ ట్రైన్‌కు వ్యతిరేకం కాదు
- భూ దోపిడీకే వ్యతిరేకం: కేటీఆర్

తెలంగాణభవన్:
పేదలను కొట్టి పెద్దలకు పెట్టడం ఇందిరమ్మ రాజ్యమా అని ప్రశ్నించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కాంగ్రెస్ నేతల భూములు ముట్టుకోరు? పేదల భూములపై మాత్రం పడతారు.

# భారత కోస్ట్‌గార్డ్ సాహసం.. సముద్రంలో తప్పిన భారీ ప్రమాదం



2లో..

# తెలంగాణ సచివాలయంలో తీవ్ర ఉద్రిక్తత



మిగతాది 2లో

# చిన్నారుల కంటెంట్‌పై ఉక్కుపాదం

- 15,326 నంబర్లు బ్లాక్
- 7,800 వెబ్ లింకులు బ్లాక్
- 100 డివైజ్‌లు సీజ్
- రహస్య గ్రూపులపై నజర్
- నిందితుల గుర్తింపులో పోలీసులు
- 1930కు ఫిర్యాదు చేయండి



మిగతాది 2లో

చిన్నారుల లైంగిక కంటెంట్ ను ఆన్‌లైన్‌లో వ్యాప్తి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు రాజస్థాన్ పోలీసులు సిద్ధమయ్యారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 29,2026

# రూ.71.89 లక్షల మోసం.. 15 ఏళ్ల తర్వాత వెలుగులోకి!

మొదటిపేజీ తరువాయి
నెలకు నాలుగు శాతం చొప్పున రాబడి పేరుతో ఈ మొత్తం తీసుకుని మోసం చేశారంటూ అక్కడి రాజ్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో శనివారం కేసు నమోదు చేశారు. నిందితుల జాబితాలో హైదరాబాద్‌కు చెందిన అమన్‌దీప్ సింగ్ ఠాకూర్‌తో పాటు జునాగఢ్‌కు చెందిన రాజీవ్ శర్మ కూడా ఉన్నారు. అక్కడి ప్రముఖ ఆడిట్, ఆర్థిక సలహాదారు పరేష్ మెన్‌పరా ఫిర్యాదు మేరకు నమోదు చేసిన ఈ కేసు దర్యాప్తు కోసం త్వరలోనే రాజ్‌కోట్ పోలీసులు హైదరాబాద్ చేరుకోనున్నారు.

ప్రాథమిక సమాచార నివేదికలోని (ఎఫ్‌ఐఆర్) అంశాల ప్రకారం... 2011లో ఓ సంస్థకు ఆడిట్ నిర్వహిస్తున్న సమయంలో రాజీవ్ శర్మతో బాధితుడు పరేష్‌కు పరిచయం ఏర్పడింది. జునాగఢ్‌లోని గుజరాత్ ఇండ్రస్టియల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ (జీఐడీసీ) పరిధిలోని వెట్‌టెల్ కమోడిటీస్ లిమిటెడ్ సంస్థలో పెట్టుబడి పెట్టాలంటూ సూచించిన శర్మ అహ్మదాబాద్‌కు చెందిన ప్రణవ్ షా, చింతన్ షాలను పరిచయం బాధితుడికి చేశాడు.

ఈ ద్వయం తమ ప్రాజెక్టుకు సంబంధించి పరేష్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. తాను ఆ సంస్థ ఏజెంట్‌నని శర్మ చెప్పడంతో పాటు పెట్టుబడిపై నెలకు నాలుగు శాతం రాబడితో పాటు లాభాల్లో 60 శాతం వాటా ఇస్తామని నిందితుడు హామీ ఇచ్చినట్లు పరేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పెట్టుబడి మొత్తాన్ని బంగారం, వెండి ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వినియోగిస్తామని ఆ సమయంలో వాళ్లు చెప్పినట్లు తెలిపారు. ఆ తర్వాత సంస్థ చైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన అమన్‌దీప్ సింగ్ ఠాకూర్‌ను పరిచయం చేశారు.
పెట్టుబడికి బ్యాంకు హామీ ఇప్పిస్తామని శర్మ భరోసా ఇవ్వడంతో పరేష్ రూ.71.89 లక్షలు పెట్టుబడిగా పెట్టేందుకు అంగీకరించారు. 2011 సెప్టెంబర్ 14న వీరి మధ్య దీనికి సంబంధించిన అధికారిక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఎంఓయూ కూడా రాసుకున్నారు. అనంతరం తన డబ్బుతో అమన్‌దీప్ సింగ్ ఠాకూర్‌తో ట్రేడింగ్ నిర్వహించగా, జునాగఢ్ నుంచి శర్మ ఆ సంస్థ కార్యకలాపాలను నిర్వహించినట్లు పరేష్ ఆరోపించారు. అయితే హామీ ఇచ్చిన మేరకు లాభాలతో పాటు పెట్టుబడి కూడా తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడు శర్మను సంప్రదించారు.

ఈ సమయంలో అమన్‌దీప్ సింగ్ ఠాకూర్ ఆ మొత్తాన్ని తిరిగి చెల్లిస్తాడని శర్మ హామీ ఇచ్చినట్లు బాధితుడు రాజ్‌కోట్ పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలోనే నగదు తిరిగి చెల్లిస్తున్నానంటూ అమన్‌దీప్ సింగ్ ఠాకూర్ రెండు చెక్కులు జారీ చేశారు. అయితే ఆ బ్యాంకు ఖాతాల్లో నిధులు లేని కారణంగా అవి బౌన్స్ అయ్యాయి. దీంతో బాధితుడు పరేష్ దీనిపై 2012 మార్చి 17న నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (ఎన్‌ఐ) చట్టం కింద నోటీసు జారీ చేశారు. దీనిపైనా నిందితుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో తాజాగా రాజ్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

# భారత కోస్ట్‌గార్డ్ సాహసం.. సముద్రంలో తప్పిన భారీ ప్రమాదం

మొదటిపేజీ తరువాయి
భారత కోస్ట్‌గార్డ్ సమయస్ఫూర్తితో సముద్రంలో భారీ ప్రమాదం తప్పింది. ఒకవైపు ఇంజిన్ వైఫల్యం, మరోవైపు లీకేజీ కారణంగా బాలాస్ట్ ట్యాంక్‌లోకి నీరు చేరడంతో సముద్రంలో అస్థిరంగా మారిన ఓ విదేశీ నౌకను నీటమునగకుండా కాపాడింది. ఒడిశాలోని పారాదీప్ తీరానికి సుమారు 37 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

ఐసీజీ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎంటీ సీగల్ 9 అనే నౌక 23 మంది సిబ్బంది, 9,000 మెట్రిక్ టన్నుల పామాయిల్ లోడ్‌తో ఒడిశాకు వస్తోంది. అయితే.. ఆదివారం ప్రధాన ఇంజిన్ ఫెయిలయ్యింది. దీనికి తోడు బాలాస్ట్ ట్యాంక్‌లోకి నీరు వేగంగా ప్రవేశించడంతో.. నౌక ప్రమాదకరంగా ఒకవైపు వంగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది.. అత్యవసర సాయం కోరుతూ భారత కోస్ట్‌గార్డ్‌ను సంప్రదించారు. స్పందించిన ఐసీజీ వెంటనే ఐసీజీఎస్ విశ్వాస్థ్ అనే నౌకను ఘటనా స్థలానికి పంపించింది. కోస్ట్‌గార్డ్‌కు చెందిన ప్రత్యేక బృందం.. క్లిష్టమైన పరిస్థితుల్లోనే ఆ నౌకలోకి ప్రవేశించింది. అధునాతన పరికరాలను ఉపయోగించి.. నీటిని తోడేయడంతోపాటు లీకేజీని అరికట్టింది. ఇతర నష్టనివారణ చర్యలూ తీసుకుంది. దీంతో ఆ నౌక మునిగిపోయే ప్రమాదం నుంచి బయటపడింది. ముందుజాగ్రత్త చర్యగా మరో రెండు నౌకలను, గగనతల నిఘా కోసం భువనేశ్వర్ నుంచి డోర్నియర్ విమానాన్ని కూడా ఐసీజీ రంగంలోకి దించింది.

అనంతరం పారాదీప్ పోర్ట్ అథారిటీకి చెందిన డాల్ఫిన్ అనే టగ్ బోట్.. ఆ నౌకను పారాదీప్ తీరానికి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇంజిన్‌కు మరమ్మతులు జరుగుతున్నాయి. తొలుత ఘటనాస్థలంలో స్వల్ప పామాయిల్ పొర కనిపించినప్పటికీ.. సోమవారం నాటికి పూర్తిగా తొలగిపోయినట్లు గుర్తించామని ఐజీసీ అధికారులు తెలిపారు.

# తెలంగాణ సచివాలయంలో తీవ్ర ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి
తెలంగాణ సచివాలయంలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఏళ్లు గడుస్తున్నా తమకు రావాల్సిన బిల్లులు రాకపోవడంతో విసిగిపోయిన రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛాంబర్ ఎదుట ఆందోళనకు దిగారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వచ్చిన వారిని భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి.

సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆందోళనకారులు వాపోయారు. తమ సమస్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను, ఫైనాన్స్ సెక్రటరీని కలిసేందుకు ప్రయత్నిస్తే అధికారులు అనుమతించడం లేదని మండిపడ్డారు. ఎన్నిసార్లు చుట్టూ తిరిగినా భట్టిని కలిసే అవకాశం ఇవ్వడం లేదని, కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**భీష్మించుకు కూర్చున్న ఆందోళనకారులు**

తమకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో అపాయింట్‌మెంట్ ఇప్పించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్లు ఛాంబర్ ఎదుట బైఠాయించి భీష్మించుకు కూర్చున్నారు. ప్రభుత్వ తీరుపై నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.

**పోలీసులతో వాగ్వాదం**

పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో సచివాలయ భద్రతా సిబ్బంది, పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, రిటైర్డ్ ఉద్యోగులు, కాంట్రాక్టర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సచివాలయంలో ప్రభుత్వ ప్రతినిధుల ఛాంబర్ వద్దే బాధితులు ఆందోళనకు దిగడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం కొనసాగింది.

# రీసర్వేతో భూ సమస్యలకు చెక్

మొదటిపేజీ తరువాయి
సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రికార్డుల లోపాలు, అబాది ఆస్తుల సమస్యలను కూడా సర్వే ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపైనా మంత్రి కీలక వివరాలు వెల్లడించారు.

దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. భూముల హద్దులు, పాత రికార్డుల్లో తప్పులు, సాదాబైనామాలు, అబాది ఆస్తులు వంటి సమస్యలకు సమగ్ర భూ సర్వే ద్వారా పరిష్కారం చూపవచ్చని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రీసర్వే కీలక మార్గమని ఆయన పేర్కొన్నారు. వనపర్తిలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ శాఖలపై సమీక్ష నిర్వహించిన తర్వాత మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.

క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలను గుర్తించి వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. వనపర్తిలో రెవెన్యూ అంశాలపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర భూ సర్వే చేపడుతున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా నక్షాలు అందుబాటులో లేని మరో 413 రెవెన్యూ గ్రామాలను కూడా దశలవారీగా సర్వే చేయనున్నట్లు వెల్లడించారు.

ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు జియో కోఆర్డినేట్స్‌తో కూడిన మ్యాప్, ఎల్‌పీఎం నంబర్ అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి చెప్పారు. సర్వే పూర్తి అయిన తర్వాత భూ యజమానులకు భూమికి సంబంధించిన వివరాలను మరింత స్పష్టంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే తెలంగాణలో భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి రీసర్వేను రాష్ట్ర ప్రభుత్వం వినియోగిస్తోంది. ఇటీవల మహబూబాబాద్ జిల్లాలో రీసర్వే పూర్తయిన అసైన్డ్ భూములకు సంబంధించిన రైతులకు పట్టాదార్ పాస్‌బుక్కులు అందించినట్లు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

భూ సర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చుతోందని పొంగులేటి తెలిపారు. తొలి దశలో కొనుగోలు చేసిన రోవర్లతో పాటు రెండో దశలో అదనపు రోవర్లను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. జిల్లాల అవసరాలకు అనుగుణంగా వాటిని కేటాయిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా వేలాది మంది సర్వేయర్లకు లైసెన్సులు మంజూరు చేసి క్షేత్రస్థాయిలో సర్వే పనులను వేగవంతం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాజకీయ ప్రచారాలకు దూరంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమంలో భాగస్వాములై రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కలిగించేలా పనిచేయాలని సర్వేయర్లకు సూచించారు.
గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలు, భూ హద్దుల వివాదాలు, పాత రెవెన్యూ రికార్డుల్లోని లోపాలు, అబాది ఆస్తుల వివరాలు వంటి సమస్యలను సమగ్ర సర్వే ద్వారా పరిష్కరించే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. దశాబ్దాలుగా భూమిని సాగు చేస్తున్నప్పటికీ సరైన టైటిల్ లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలను కూడా గుర్తించి.. నిబంధనల ప్రకారం సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.
గ్రామాల్లో ఇళ్ల స్థలాలు, నివాస ప్రాంతాలు, అబాది ఆస్తులకు సంబంధించి గతంలో స్పష్టమైన మ్యాపింగ్ లేకపోయిన సందర్భాలు ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఇకపై సర్వే ద్వారా ప్రతి ఆస్తి విస్తీర్ణం, హద్దులు వంటి వివరాలను మ్యాప్‌తో సహా రికార్డుల్లో పొందుపరచనున్నట్లు చెప్పారు. ధరణి వ్యవస్థ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగిస్తూ భూ భారతి ద్వారా మరింత పారదర్శకమైన భూ రికార్డుల వ్యవస్థను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి తెలిపారు. ప్రతి భూ పార్శిల్‌కు ప్రత్యేక గుర్తింపు, మ్యాప్, జియో కోఆర్డినేట్స్ వంటి వివరాలు అందుబాటులో ఉంటే భవిష్యత్తులో హద్దులు, యాజమాన్యానికి సంబంధించిన వివాదాలను తగ్గించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది.

భూ సమస్యలను కార్యాలయాల్లో కూర్చొని కాకుండా ప్రజల కోణంలో పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల్లో కొన్ని ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన వాటిని కూడా నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంతో పాటు పేదల సొంతింటి కలను నెరవేర్చడంపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. తొలి విడతలో మంజూరైన 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో 2 లక్షలకు పైగా ఇళ్లు పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేస్తామని తెలిపారు.
రెండో విడతలో నిర్మాణం ప్రారంభించే ఇళ్లలో గతంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పేదల ఇళ్లకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి చెప్పారు. రెండో విడతలో అవకాశం రాని అర్హులైన పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మూడో, నాలుగో విడతల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి స్పష్టం చేశారు.
మొత్తంగా భూ భారతి కింద చేపడుతున్న రీసర్వే ద్వారా పాత భూ రికార్డుల్లోని సమస్యలను గుర్తించి, భూముల హద్దులు, మ్యాపింగ్, యాజమాన్య వివరాలను మరింత స్పష్టంగా నమోదు చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రక్రియ పూర్తి అయితే భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

# మా నేత గెలవాల్సిన సీటును సైతం కుట్రపూరితంగా చోరీ చేశారు

మొదటిపేజీ తరువాయి
ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు వ్యవహరిస్తూ బీజేపీకి అనుకూలంగా మారిందని విమర్శించారు. ఎన్నికల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఇవాళ హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో నిష్పాక్షికత లోపించిందని ఓటర్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని పేర్కొన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేలా వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపించారు.
ఎన్నికల కమిషనర్ల పనితీరుపై అధికారుల్లోనూ అసంతృప్తి ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గుతోందన్నది కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆరోపణగా పేర్కొన్నారు. బిహార్‌లో ఆర్జేడీ, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాల వెనుక ఎన్నికల సంఘం మోసపూరిత వైఖరి ఉందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత మీనాక్షి నటరాజన్ గెలవాల్సిన రాజ్యసభ స్థానాన్ని కూడా కుట్రపూరితంగా కోల్పోయేలా చేశారని విమర్శించారు. ఓట్ల అక్రమాల ద్వారా ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోందని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ఎన్నికల సంఘం పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమని మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ఇతర పార్టీ నేతలు పేర్కొన్నారు.

# ఖైరతాబాద్‌లో దిమ్మతిరిగే ఫలితం!

మొదటిపేజీ తరువాయి
ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. "ఖైరతాబాద్ ఉప ఎన్నికలో దిమ్మతిరిగే ఫలితం వస్తుంది. ఎవడు కొడితే మైండ్ బ్లాక్ అవుతుందో అలా ఉంటుంది. ఈసీని అడ్డుపెట్టుకొని భాజపా ఓటు చోరీ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు చోరీతోనే కిషన్‌రెడ్డి గెలిచారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ వెంటనే రాజీనామా చేయాలి. 'సర్' లోపాల అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి"అని దానం నాగేందర్ అన్నారు.

# ఆరో తరగతికి త్రిభాషా విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలి: సుప్రీం కోర్టు

మొదటిపేజీ తరువాయి
2027 ఏప్రిల్ 1 నుంచి త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సూచించింది. సీబీఎస్ఈ త్రిభాషా విధానంలోని అంశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. అకస్మాత్తుగా సీబీఎస్ఈ భాషా విధానం మార్చడంపై సుప్రీం కోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తింది. ఇప్పటికే ఇతర భాషలు ఎంచుకున్న విద్యార్థులు మధ్యలో మరో భాషకు మారాలంటే ఇబ్బంది పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేసిన పాఠశాలలను సంప్రదించి, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు.

# ఆన్‌లైన్‌లో చిన్నారుల అసభ్య కంటెంట్.. 15 వేల నంబర్లు బ్లాక్

మొదటిపేజీ తరువాయి
ఈ క్రమంలోనే సోమవారం 15,326 మొబైల్ నంబర్లు, దాదాపు 7800 వెబ్ లింకులు, సోషల్ మీడియా ప్రొఫైళ్లు, 100 ఎలక్ట్రానిక్ డివైజ్‌లను బ్లాక్ చేశారు. బాలల అసభ్య కంటెంట్ వ్యాప్తికి సంబంధించి భారీగా ఫిర్యాదులు అందుతున్న క్రమంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సైబర్ క్రైమ్ అదనపు డీజీపీ వీకే సింగ్ వెల్లడించారు. వాటిని పరిశీలించి నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికి కఠిన శిక్ష తప్పదని హెచ్చరించారు.
ఈ కేటుగాళ్లు పలు యాప్‌లలో రహస్య గ్రూపులు, ఛానళ్లు ఏర్పాటు చేసి చిన్నారుల అసభ్య కంటెంట్‌ను విపరీతంగా షేర్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వాటిల్లో గుర్తుతెలియని వారితో పరిచయాలు పెంచుకుని.. ఆ తర్వాత వారు సూచించే యాప్‌లలోకి రావాలని సూచిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కంటెంట్ కనిపిస్తే డౌన్‌లోడ్ చేయడం, ఇతరులకు షేర్ చేయడం చేయకూడదని సూచించారు. వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని కోరారు.

# తెలంగాణ 'స్థానికత' అంశం.. మరోసారి సుప్రీంకోర్టు క్లారిటీ

మొదటిపేజీ తరువాయి
రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం నడుచుకోవాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. గతంలో జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును పునరుద్ఘాటించింది. తెలంగాణ స్థానిక రిజర్వేషన్‌కు నాలుగేళ్ల విద్యాభ్యాసం తప్పనిసరి నిబంధనను సవాల్ చేస్తూ జెల్ల అంకిత దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. నిబంధన ఏకపక్షంగా ఉందన్న వాదనను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం కొట్టివేసింది. ఎంబీబీఎస్ అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో విద్యాభ్యాసం చేస్తేనే స్థానికత వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో గతంలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను మరోసారి సమర్థించింది.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులా? మీరే నష్టపోతారు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి
హైడ్రాకు కాంగ్రెస్ నేతల భూములు కనపడవా?. రైతుల ఇంటికి పోలీసులను పంపాల్సిన అవసరం ఏంటి? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడితే మీరే నష్టపోతారు అంటూ వ్యాఖ్యలు చేశారు.

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణభవన్‌లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన మూడేళ్ల మురిపెం అయ్యింది. కాంగ్రెస్ 420 హామీలిచ్చి ప్రజలను మోసం చేసింది. తెలంగాణలో గడిచిన మూడేళ్లలో సీఎం రేవంత్ రెడ్డి ఒక్క మంచి పనైనా చేశాడా?. రేవంత్ రెడ్డికి తెలిసింది భూములు అమ్మడం, భూములు కొనడం. రేవంత్‌కు తెలిసింది భూముల దందా ఒక్కటే. బహదూర్‌గూడ భూములపై రేవంత్ రెడ్డి కన్నుపడింది. రేవంత్ పేదల కడుపుకొట్టి పెద్దవాళ్ల కడుపు నింపే ప్రయత్నం చేస్తున్నారు. సుప్రీంకోర్టు వెళ్లి అయినా సరే మన భూములను కాపాడుకుందాం. బహదూర్‌గూడలో రేవంత్ రెడ్డికి రైతులు కనబడటం లేదు. అక్కడ రూ.6000 కోట్ల భూములు మాత్రమే కనిపిస్తున్నాయి. ఫార్మాసిటీని రద్దు చేసి భూములు వెనక్కి ఇస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక మాత్రం ఫ్యూచర్ సిటీ కడుతామని అంటున్నారు.

రైతులు భూములు ఇచ్చింది.. ఫార్మా సిటీ కోసమే తప్పఫ్యూచర్ సిటీ కోసం కాదు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు మహేశ్వరం, కల్వకుర్తి ప్రాంతాల్లో భారీ భూదందా చేస్తున్నారు. బినామీలు ఎవరెవరు? వారి పేర్లు అన్ని సమయం వచ్చినప్పుడు చెప్తా. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెడితే మీరే నష్టపోతారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారు.బుల్లెట్ ట్రైన్‌కు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు. బుల్లెట్ రైలు పేరుతో చేసే భూ దోపిడీకే మేము వ్యతిరేకం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు కోసం సేకరించిన భూముల్లోనే బుల్లెట్ ట్రైన్ పెట్టొచ్చు కదా. ఏడాదిన్నరలో మళ్లీ కేసీఆర్ వస్తారు. కేసీఆర్ వచ్చాక మళ్లీ మీ పట్టాలు మీకు అప్పగిస్తాం. మోసపోతే గోస పడతారని కేసీఆర్ ముందే చెప్పారు.' అని కామెంట్స్ చేశారు.

# ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీపై గెజిట్ నోటిఫికేషన్

ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు తెలంగాణ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. సెప్టెంబర్ 26వ తేదీతో అసెంబ్లీ కార్యదర్శి తిరుపతి గెజిట్ జారీ చేశారు. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై ఇటీవల హైకోర్టు అనర్హత వేటు వేసిన సంగతి తెలిసిందే. 2024 ఏప్రిల్ 23 నుంచి అనర్హత అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఈ స్థానం అప్పటి నుంచి ఖాళీ అయినట్లు గెజిట్ జారీ అయ్యింది.


R.N.I. No. TELMUL/2016/73158.
HSE No. 1051/2024-2026.

తెలంగాణ రాజ పత్రము
THE TELANGANA GAZETTE
PART-II EXTRAORDINARY
PUBLISHED BY AUTHORITY

No. 858-A] HYDERABAD, SATURDAY, SEPTEMBER 26, 2026.

NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS, Etc.

TELANGANA LEGISLATIVE ASSEMBLY

TELANGANA LEGISLATIVE ASSEMBLY - DISQUALIFICATION OF SRI DANAM NAGENDER, MEMBER ELECTED FROM 60-KHAIRATABAD ASSEMBLY CONSTITUENCY - VACANCY OF THE SEAT.

C.No.210/Legn./2026.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
మంగళవారం సెప్టెంబర్ 29,2026

# బొద్దింకలను నలిపేస్తున్న మొసళ్ళు

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

▪ జన్ జి తరం పేరుతో భారతదేశంలో ఒక కొత్త నిరసనలకు పోకడ మొదలైంది.

**బొద్దింకల జనతా పార్టీ అంటూ బయలుదేరిన బాధ్యతారహిత అల్లరి మూకలకు వ్యతిరేకంగా మొసళ్ళ జనతా పార్టీ మొలకెత్తింది.**

CJP vs CJP

**కాక్రోచ్ జనతా పార్టీకి జవాబుగా క్రొకడైల్ జనతా పార్టీ ప్రారంభమైంది."**

**నీట్ .. NEET పరీక్షల వివాదం**
జూన్-జూలై 2026లో మెడికల్ ప్రవేశ పరీక్ష 'చీజుజు' పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరియు పార్లమెంట్ ముట్టడి రూపంలో కృత్రిమ ఉద్యమ సంస్థ కాక్రోచ్ జనతా పార్టీ పెద్ద ఎత్తున విద్యార్థులతో నిరసనలు చేపట్టింది.

### ఉద్యమం ఆవిర్భావం
మే 2026లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన ఒక వ్యాఖ్యకు నిరసనగా ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ సోషల్ మీడియా వ్యూహకర్త అభిజీత్ దీప్కే ఈ కాక్రోచ్ జనతా పార్టీ జబ్రీ ని ఒక డిజిటల్ వేదికగా ప్రారంభించారు.

### ఇది కృత్రిమ ఉద్యమం.

సోషల్ మీడియాలో అతి తక్కువ రోజుల్లోనే అల్గారితం మాయతో దీనికి కోట్ల సంఖ్యలో ఫాలోవర్లు చేరారని మనం విన్నాం.దేశ అత్యున్నత న్యాయస్థానం చేసిన కొన్ని వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పుట్టుకొచ్చిన ఒక వ్యంగ్యాత్మక రాజకీయ డిజిటల్ ఉద్యమం ఇది.

▪ ఈ ఉద్యమం "కృత్రిమమైనదా" అనే అపవాదు నిజమేనని అనిపిస్తున్నది. దీని వెనుక "విదేశీ శక్తుల ప్రమేయం, రాజకీయ అజెండాలు" ఉన్నాయా అనే కోణంలో సోషల్ మీడియాలో మరియు అధికారిక వర్గాల్లో తీవ్ర చర్చలు, విచారణలు నడుస్తున్నాయి.

ఈ ఉద్యమంపై ప్రభుత్వ నిఘా మరియు రాజకీయ పరమైన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భారత చట్టాలను రాజ్యాంగాన్ని చేతిలోకి తీసుకొని పాఠశాలల తనిఖీ పేరుతో కందరగోల అరాచక కార్యాచరణతో బయలుదేరిన ఈ సోకాల్డ్ కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలను ప్రజలు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు.

అంతేకాకుండా, ఈ సి జె పి కార్యకర్తలపై దాడులు చేస్తున్నారు, వారి వాహనాలను ధ్వంసం చేస్తున్నారు, అనుమతి లేని ప్రదర్శన చేస్తున్న వీరిని పోలీసులు అరెస్టులు చేస్తున్నారు.

రాజస్థాన్, అస్సాం, బీహార్ వంటి వివిధ రాష్ట్రాలలో కాక్రోచ్ జనతా పార్టీ (CJP) కార్యకర్తలు లేదా వాలంటీర్లు స్థానిక ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకతను, ఘర్షణలను ఎదుర్కొంటున్న సంఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

విద్యార్థులు, యువతతో సాగుతున్న ఈ డిజిటల్ మరియు క్షేత్రస్థాయి ఉద్యమం అనార్కిజం .. అరాచకత్వం వ్యాప్తి చేస్తోందని అధికార పక్షాలు ఆరోపిస్తున్నాయి.

వివిధ ప్రాంతాల్లో సిజెపి నాయకులను ప్రజలు, పోలీసులు అడ్డుకున్న తాజా వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

**రాజస్థాన్**
**పాఠశాలల తనిఖీ వివాదం:**
రాజస్థాన్‌లోని జైపూర్ సమీపంలో ఉన్న రాంపుర-కన్వర్పుర గ్రామంలో సిజెపి కో-కన్వీనర్ ఆశుతోష్ రాంకా నేతృత్వంలోని బృందం 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలలను బాగు చేయండి) ప్రచారంలో భాగంగా ఒక ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేయడానికి వెళ్ళింది.

**ప్రజల అభ్యంతరం-రాళ్లదాడి**

స్థానిక గ్రామస్తులు సిజెపి వాలంటీర్ల ప్రవేశాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అనధికారికంగా పాఠశాలల్లోకి చొరబడి రాజకీయం చేస్తున్నారంటూ రోడ్డుపై బారికేడ్లు వేసి వారి వాహనాలను అడ్డుకున్నారు.

ఈ క్రమంలో గ్రామస్తులకు, సిజెపి కార్యకర్తలకు మధ్య తీవ్ర ఘర్షణ జరిగి, సిజెపి వాహనాలపై రాళ్లదాడి జరిగింది.

ఈ ఘటనపై బిజెపి స్పందిస్తూ.. సిజెపి సమాజంలో అశాంతిని, అరాచకాన్ని సృష్టిస్తోందని విమర్శించింది.

**అస్సాం గౌహతిలో భారీ ప్రతిఘటన**
గౌహతిలో ప్రజలు పెద్ద ఎత్తున కాక్రోచ్ వాలంటీర్ల సమావేశాల ముట్టడి చేశారు.

▪ అస్సాంలోని గౌహతిలో సిజెపి తొలి ప్రాంతీయ వాలంటీర్ల సమావేశాన్ని నిర్వహించడానికి కాక్రోచ్ జనతా పార్టీ ప్రయత్నించింది.




అయితే సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారనే నెపంతో మరియు శాంతిభద్రతల సమస్యల దృష్ట్యా స్థానికులు, పోలీసులు తీవ్రంగా అడ్డుకున్నారు.

మీరు బొద్దింకలైతే మేము మొసల్లం అంటూ యువత కాక్రోచ్ జనతా పార్టీ వాలంటీర్లను అడ్డుకుంటుంది.

పోలీస్ కస్టడీలో దీక్షలు జనతా భవన్ సమీపంలో సిజెపి కో-కన్వీనర్ ఆశుతోష్ రాంకాతో పాటు సుమారు 46 మంది వాలంటీర్లను అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

దీనికి నిరసనగా వారు పోలీస్ కస్టడీలోనే నిరాహార దీక్షకు దిగారు.

**బీహార్‌లో**
బీహార్‌లో నిరుద్యోగ నిరసనలు, పేపర్ లీకేజీలపై సిజెపి చేసిన ఆందోళనలను సాధారణ ప్రజలు మరియు వ్యాపార వర్గాలు అడ్డుకున్నాయి.

నిరసనల పేరుతో నిత్యజీవితానికి ఆటంకం కలిగిస్తున్నారంటూ పలుచోట్ల స్థానికులు తిరగబడటంతో పాటు పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకొని అరెస్టులు చేశారు.

**మధ్యప్రదేశ్**
ఇక్కడ కూడా విద్యార్థుల ఉద్యమ నెపంతో కృత్రిమంగా అజెండాలను రుద్దుతున్నారంటూ స్థానిక విద్యాసంస్థల కమిటీలు, ప్రజలు సిజెపి కార్యకర్తల ప్రచారాలను అడ్డుకున్నారు.

**ప్రస్తుత పరిస్థితి**
అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్‌లో సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తలపెట్టిన దేశవ్యాప్త నిరసన ప్రదర్శనకు ముంబై పోలీసులు పర్మిషన్ నిరాకరించారు.

▪ దీనితో సిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి దేశవ్యాప్తంగా "జైల్ భరో ఆందోళన" కు పిలుపునిచ్చింది.

▪ కాక్రోచ్ జనతా పార్టీ ప్రారంభంలో యువత మరియు నిరుద్యోగుల మద్దతుతో సోషల్ మీడియాలో భారీ సంచలనం సృష్టించినప్పటికీ, ఇటీవల క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకతను మరియు విముఖతను ఎదుర్కొంటోంది.

ప్రజా జీవితానికి ఆటంకం. అశాంతి రోడ్ల ముట్టడి. రాళ్లదాడి సంఘటనల వల్ల ప్రజల్లో ఈ బొద్దింకల ఉద్యమాల పట్ల అసహ్యం బయలుదేరింది.

**పార్టీలో అంతర్గత చీలిక**

▪ సెప్టెంబర్ 2026లో ఈ సంస్థలో పెద్ద చీలిక వచ్చింది. ఉద్యమ సీనియర్ నాయకుడు మనీష్ బ్రహ్మభట్, వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై తీవ్ర ఆరోపణలు చేస్తూ "కాక్రోచ్ జనతా పార్టీ - డెమోక్రటిక్" (CJP-D) ని స్థాపించారు.

**రాజకీయ అనుబంధాలు**
ఈ ఉద్యమం విద్యార్థుల ప్రయోజనాల కోసం కాకుండా, కేవలం ఆమ్ ఆద్మీ పార్టీ మరియు కొన్ని ప్రతిపక్ష పార్టీల రాజకీయ ప్రయోజనాల కోసం, వారి అజెండాలను రుద్దడానికి మాత్రమే పనిచేస్తోందని స్వయంగా పార్టీ నాయకులే ఆరోపించడంతో యువతకు దీనిపై నమ్మకం సడలింది.

**విదేశీ ప్రమేయం,సోషల్ మీడియా కుట్ర**
ఈ బొద్దింకల జనతా పార్టీ కి యూఎస్ లింకులున్నాయని బలమైన సాక్ష్యాలు బయటపడుతున్నాయి.

జబ్రీ సోషల్ మీడియా ఖాతాలు మరియు ఆన్‌లైన్ క్యాంపెయిన్ల వెనుక అమెరికాకు చెందిన కొన్ని ఐపీ (IP) అడ్రస్‌లు, డిజిటల్ శక్తుల ప్రమేయం ఉందనే స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

▪ ఇది స్వచ్ఛందంగా వచ్చిన యువత ఉద్యమం కాదు, భారతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలను టార్గెట్ చేయడానికి విదేశాల నుండి నడుపుతున్న ఒక "కృత్రిమ డిజిటల్ ప్రచారం"- టూల్ కిట్ అనే అనుమానాలు ప్రజల్లో బలపడ్డాయి.

**తీవ్రవాద స్థాయి డిమాండ్లు**

▪ ఓటు తొలగింపు జరిగితే ఎన్నికల కమిషనర్లను ఉగ్రవాద నిరోధక చట్టం (UAPA) కింద అరెస్ట్ చేయాలనడం, కార్పొరేట్ మీడియా సంస్థల లైసెన్సులను పూర్తిగా రద్దు చేయాలనడం వంటి అవ్యవహారిక డిమాండ్లు సాధారణ ప్రజలకు హాస్యాస్పదంగా మరియు ప్రజాస్వామ్య విరుద్ధంగా అనిపించాయి. వీరి అతివాద డిమాండ్లు అసహ్యం కలిగిస్తున్నాయి.

డీప్‌ఫేక్ వివాదాలు కోర్టు నోటీసులుచట్టపరమైన చిక్కులతో బొద్దింకల జనతా పార్టీ అసలు రంగు బయటపడింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన డీప్‌ఫేక్ వీడియోల సృష్టి, సోషల్ మీడియా దుర్వినియోగంపై ఇటీవల హైకోర్టు కాక్రోచ్ జనతా పార్టీకి మరియు ఫేస్‌బుక్‌కు నోటీసులు జారీ చేసింది.

వ్యంగ్యంతో మొదలైన ఒక ఆన్‌లైన్ ఉద్యమం, క్రమంగా హింసాత్మక ఆందోళనలకు, రాజకీయ స్వార్థానికి మరియు చట్టవ్యతిరేక చర్యలకు వేదికగా మారడమే ప్రజలు దీనికి వేగంగా దూరం కావడానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

▪ బొద్దింకల జీవితకాలం ఆరు నెలలు. బొద్దింకలకు తమ జీవితకాల చివరి దశలో రెక్కలు వస్తాయి. రెక్కలు వచ్చిన బొద్దింకలు ఎగురుతాయి. ఎగురుతున్నాయంటే బొద్దింకల జీవితకాలం ముగిసినట్టే.

**కాక్రోచ్ జనతా పార్టీ జీవితకాలం ముగిసింది.**

▪ ఇక జన్ జి యువత బొద్దింకల పాలిట మొసళ్ళు గా మారాయి.

భారత దేశ యువత నిర్మాణాత్మక కార్యక్రమాలను మాత్రమే ఇష్టపడుతుంది. ఈ బొద్దింకల నకారాత్మక కార్యక్రమాలను జన్ జి యువత కాల రాస్తుంది.

# పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లు రికవరీ

◆ బాధితులకు ఫోన్లు అప్పగించిన జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ
◆ పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లు రికవరీ
◆ బాధితులకు ఫోన్లు అప్పగించిన జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ



కరపత్రం ప్రతినిధి జమ్మికుంట: సెప్టెంబర్ 28
జమ్మికుంట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో పోగొట్టుకున్న ఐదు మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి రికవరీ చేసి, వాటి అసలు యజమానులకు తిరిగి అప్పగించారు.జమ్మికుంట పట్టణ పరిధిలో గత కొంతకాలంగా వివిధ కారణాలతో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోలీసులకు ఫిర్యాదులు అందించారు. ఈ ఫిర్యాదులపై పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఈఐఆర్ ఆపరేటర్ కానిస్టేబుల్ సౌమ్య ప్రత్యేకంగా దృష్టి సారించి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ మొబైల్ ఫోన్లను ట్రేస్ చేశారు. అనంతరం వాటిని రికవరీ చేయడం జరిగింది.రికవరీ చేసిన ఐదు మొబైల్ ఫోన్లను సోమవారం జమ్మికుంట పట్టణ పోలీస్ స్టేషన్‌లో వాటి యజమానులకు సీఐ రామకృష్ణ చేతుల మీదుగా అప్పగించారు.

మొబైల్ ఫోన్లు అందుకున్న బాధితులు:
1. కొమ్ము ప్రేమ్ కుమార్
2. ఎండి రియాజుద్దీన్
3. గాదె రాములు
4. ఎండి సాదిక్
5. యాద వెంకటాచలం

పోగొట్టుకున్న తమ మొబైల్ ఫోన్లను తిరిగి పొందడంతో బాధితులు జమ్మికుంట పట్టణ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేయడంలో ప్రత్యేకంగా కృషి చేసిన సీఐ రామకృష్ణ, కానిస్టేబుల్ సౌమ్యలను అభినందించారు.పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందేందుకు ప్రజలు సీఈఐఆర్ పోర్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు సూచించారు.

# రైతులకు అండగా సహకార సంఘాలు

కరపత్రం ప్రతినిధి వేములవాడ
రైతులకు అండగా నిలుస్తూ వారి సంక్షేమానికి సహకార సంఘాలు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. నూతనంగా ఏర్పడిన వేములవాడ పీఏసీఎస్ సర్వసభ్య సమావేశానికి సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై చైర్మన్ వకుళాభరణం శ్రీనివాస్ తో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంఘం పరిధిలోని 22 గ్రామాల రైతులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సంఘ సభ్యులు ఐక్యంగా పనిచేసి పీఏసీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ కొండ రాజశేఖర్, పిఏసిఎస్ కార్యదర్శి, అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# నరసరావుపేట సిపిఐ కార్యాలయంలో సర్దార్ భగత్ సింగ్ 119 జయంతి నివాళులు

కరపత్రం ప్రతినిధి నరసరావుపేట, సెప్టెంబర్ 28 :
పల్నాడు జిల్లా నరసరావుపేట సిపిఐ కార్యాలయంలో సర్దార్ భగత్ సింగ్ 119వ జయంతి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం సర్దార్ భగత్ సింగ్ 119 జయంతి సందర్భంగా ఘనంగా నివాళు లర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వై ఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, ఆనాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించి దేశభక్తిని పురికొల్పిన దేశ యువతని ఒక తాటి మీద తీసుకొచ్చి తన ప్రాణాలని తృణప్రాయంగా అర్పించి దేశ స్వతంత్రం కోసం త్యాగం చేసినటువంటి మహానుభావుడు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ అని అన్నారు. ఆయన స్ఫూర్తిగా తీసుకొని




నేటి యువత ముందు కొనసాగాలని మరియు విద్య వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. అదేవిధంగా నేటి పాలకులు విధానాల వల్ల నిరుద్యోగం వెళతాండం చేస్తుందని చేస్తుందని అన్నారు. అయితే ఈ దేశ యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కరువయ్యాయని, రాజీలేని పోరాటాలు చేయాలని కడసారిగా పలికిన ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని దేశవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ముందుకు తీసుకెళ్లాలని నిరుద్యోగం పైన పోరాటం చేసి సమగ్ర యువజన విధానాన్ని రూపకల్పనకి పూనుకోవాలని ఆయన అన్నారు. ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతు నాగేశ్వరావు మాట్లాడుతూ, విద్యార్థులు సమస్యల పైన యువజన సమస్యల పైన భగత్ సింగ్ స్ఫూర్తిగా రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి రోడ్ల అంజిరెడ్డి బుల్లెట్ సూర్య అదే విధంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు హేమంత, మధు, హర్ష, నజీర్, గోపి, సిపిఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, సిహెచ్ నాగేశ్వరావు, బ్రహ్మయ్య, కోయ శీను తదితరులు పాల్గొన్నారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థుల సమస్యలపై పోరాడాలి

◆ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

కరపత్రం ప్రతినిధి వేములవాడ
భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు సామాజిక మార్పు కోసం ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ పిలుపునిచ్చారు. సోమవారం వేములవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువల కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు అయాన్, ధనుష్, అక్మల్, షాహిద్, మధు, రామ్, శివతేజ, సిద్దు, భార్గవ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తనోత్పత్తితో రైతులకు అదనపు లాభాలు

- నాణ్యమైన విత్తన ఎంపికతో అధిక దిగుబడులు సాధించవచ్చు
- వరి విత్తనోత్పత్తి, నేల ఆరోగ్యం, సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన






**కరపత్రం ప్రతినిది, జమ్మికుంట, సెప్టెంబర్ 28:** రైతులు నాణ్యమైన విత్తనాలను స్వయంగా ఉత్పత్తి చేసుకోవడంతో పాటు విత్తనోత్పత్తి పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం ఆబాది జమ్మికుంట రైతు వేదికలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులు, రైతులకు విత్తనోత్పత్తిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి. మధుకర్‌రావు మాట్లాడుతూ వరి పంటలో నాణ్యమైన విత్తనోత్పత్తి కోసం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తన ఎంపిక నుంచి పంట సాగు వరకు ప్రతి దశలో శాస్త్రీయ పద్ధతులను పాటించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం, పొలంలో ఇతర రకాల మొక్కలను తొలగించడం, పంటలో కల్తీ రకాలు లేకుండా చూడటం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.వరి పంట విత్తనోత్పత్తిలో బేరుకులు తీయడం, విత్తన శుద్ధి, పంట పర్యవేక్షణ, కోతకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలను శాస్త్రవేత్త వివరించారు. నాణ్యమైన విత్తనమే అధిక దిగుబడికి ప్రాథమిక ఆధారమని, విత్తన నాణ్యత విషయంలో రైతులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

**నేల ఆరోగ్యాన్ని కాపాడాలి**

కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త జె. విజయ్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిరక్షణపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించడం వల్ల నేల సహజ సారవంతతపై ప్రభావం పడే అవకాశం ఉందని, అందువల్ల నేల పరీక్షల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని సూచించారు.సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, వరి పంట యాజమాన్య పద్ధతులు, పంటకు అవసరమైన పోషకాలు, నేల ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలను రైతులకు వివరించారు. వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను పాటించడం ద్వారా పెట్టుబడి వ్యయాన్ని నియంత్రించడంతో పాటు దిగుబడిని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

**విత్తనోత్పత్తితో అదనపు ఆదాయం**

మండల వ్యవసాయ అధికారి షేక్ ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ రైతులు విత్తనోత్పత్తిని ఒక అదనపు ఆదాయ మార్గంగా కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, ఎరువుల వినియోగం, పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.అలాగే రైతుల వివరాలను ప్రభుత్వ వ్యవసాయ సేవలతో అనుసంధానం చేసేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాధాన్యతను వివరించారు. రైతులు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా రైతులు విత్తనోత్పత్తికి సంబంధించిన పలు సందేహాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై మరింత అవగాహన పెంచుకోవాలని అధికారులు రైతులకు సూచించారు.

**50 మంది రైతుల పాల్గొనడం**

ఈ శిక్షణ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజేష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జమ్మికుంట కార్యదర్శి రవీందర్, డైరెక్టర్ వొజ్జ రాజశేఖరరావు, సహకార సంఘం సభ్యులతో పాటు సుమారు 50 మంది రైతులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన 9వ వార్డు కౌన్సిలర్ పొనగంటి రాము

- మృతుడి అంత్యక్రియల ఖర్చులు స్వయంగా భరిస్తూ బాధిత కుటుంబానికి అండ
- మానవత్వమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని చాటిన కౌన్సిలర్









**కరపత్రం ప్రతినిది, జమ్మికుంట:సెప్టెంబర్ 28**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణం మోతుకులగూడెం గ్రామం గ్రామంలో 9వ వార్డు కౌన్సిలర్ పొనగంటి రాము కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలిచి వారి బాధను పంచుకోవడమే నిజమైన ప్రజాసేవకు నిదర్శనమని చాటిచెప్పారు. వార్డుకు చెందిన బలభద్ర రామారావు అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులను తీవ్ర విషాదానికి గురిచేసింది.విషాదకర ఘటన విషయం తెలుసుకున్న వెంటనే కౌన్సిలర్ పొనగంటి రాము స్పందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించేందుకు అవసరమైన సహాయాన్ని అందించారు. పోస్టుమార్టం ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లలోనూ కుటుంబ సభ్యులకు అండగా నిలిచారు. ఒక్కసారిగా కుటుంబ పెద్దను కోల్పోయిన పరిస్థితుల్లో తీవ్ర ఆవేదనలో ఉన్న కుటుంబ సభ్యులకు తన వంతు సహకారం అందించారు. ఇదే సమయంలో మృతుడి అంత్యక్రియలకు సంబంధించిన ఖర్చులను సైతం స్వయంగా భరిస్తూ బాధిత కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచారు. ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవడంతో పాటు, అంత్యక్రియలు సజావుగా జరిగేలా అవసరమైన సహాయ సహకారాలు అందించారు.ప్రజలకు అవసరం వచ్చినప్పుడు వారి సమస్యలను తెలుసుకోవడం, కష్టాల్లో ఉన్న కుటుంబాల వద్దకు వెళ్లి పరిస్థితిని అర్థం చేసుకోవడం, చేతనైన సహాయం అందించడం ద్వారా పొనగంటి రాము ప్రజాసేవలో తనదైన ముద్ర వేస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.పదవి ఉన్నప్పుడు మాత్రమే ప్రజల మధ్య కనిపించడం కాదు.. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ముందుకు వచ్చి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని పలువురు అభిప్రాయపడ్డారు. మృతుడి కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్న సమయంలో కౌన్సిలర్ అందించిన సహకారం మానవత్వానికి నిదర్శనంగా నిలిచిందని తెలిపారు.

"పదవి కోసం కాదు... ప్రజల కోసం సేవ..
ఆపదలో అండగా... అవసరంలో తోడుగా...
ప్రజల కష్టాల్లో ముందుండే నాయకత్వం" అంటూ స్థానికులు కౌన్సిలర్ పొనగంటి రాము సేవలను అభినందించారు.కష్టాల్లో ఉన్న కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్ పొనగంటి రాము చర్య స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను కేవలం వార్డు సమస్యల పరిష్కారానికే పరిమితం చేయకుండా, ఆపదలో ఉన్న ప్రజలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడం అభినందనీయమని పలువురు అన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ విద్యార్థికి రాష్ట్రస్థాయి చెస్ పోటీలో ద్వితీయ స్థానం , రన్నరప్ ట్రోఫీ కైవసం



**కరపత్రం ప్రతినిది కరీంనగర్**

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పాఠశాలకు చెందినటువంటి విద్యార్థి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో ద్వితీయ స్థానం సాధించడం పట్ల ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక అభినందన సభకు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థిని సన్మానించి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రధానంగా వారికి ఎదురైనటువంటి ఒత్తిడి నుండి ఉపశమనం కలిగించడమే కాకుండా ఇతరులతో సత్సంబంధాలు పెంపొందించడానికి ప్రధానంగా సోదరభావాన్ని వ్యాప్తి చేయడానికి క్రీడలు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. ఈ క్రమంలో హైదరాబాద్లోని ఒక ప్రైవేటు వేడుక మందిరంలో తెలంగాణ స్టేట్ చెస్ అసోసియేషన్ ఈనెల 18 నుండి 20 వరకు వారు నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి జి.శివాన్, 8వ తరగతి, అండర్ - 15 బాలుర విభాగంలో రాష్ట్రస్థాయి ద్వితీయ స్థానంతో పాటు రజత పతకాన్ని గెల్చుకున్నాడని హర్షం వ్యక్తం చేస్తూ విజేతకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి భవిష్యత్తులోనూ ఇదే విజయం పరంపరకు కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## మాసాయిపేట బిజెపి మండల అధ్యక్షులు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లకు సన్మానం

- నిరంతరం అంగన్వాడి ఆశ వర్కర్ సేవలు వారికి తగిన స్థాయిలో అందరికి సేవలను అందించాలి






**కరపత్రం ప్రతినిది వెల్దుర్తిమాసాయిపేట, సెప్టెంబర్ 28:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్పం కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు మాసాయిపేట మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఆశా వర్కర్లకు మాసాయిపేట మండల బీజేపీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సమాజంలో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలను బీజేపీ నాయకులు అభినందించి, వారిని శాలువాలతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షులు మోలుగు నాగేందర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఏశం నవీన్ యాదవ్, మండల బి జె వై ఎం అధ్యక్షులు గోగొండ విఠల్, బూత్ అధ్యక్షులు గౌరగాళ్ల రాములు, మండల కిసాన్ మోర్చా కార్యదర్శి ముక్క యాదగిరి తదితరులు పాల్గొన్నారు.సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలను గౌరవించడం, ప్రజా సేవలో భాగస్వామ్యం కావడం తమ బాధ్యతగా భావిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు.

# ఓట్ల చోరీ వ్యవహారంపై కాంగ్రెస్ భగ్గుమంది






- » సీఈసీ గ్యానేశ్ కుమార్ నిర్ణయాలకు వ్యతిరేకంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన
- » గ్యానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్
- » దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

**కరపత్రం ప్రతినిది, కరీంనగర్, సెప్టెంబర్ 28:** ఓట్ల చోరీ వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ, డీసీసీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓట్ల చోరీ, ఓటర్ల జాబితాల్లో అవకతవకలు ఉన్నాయంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఓటుకు రక్షణ కల్పించే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని నాయకులు పేర్కొన్నారు.

**కలెక్టరేట్ వద్ద నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం**

జిల్లా కలెక్టరేట్ వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఈసీ గ్యానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. అనంతరం గ్యానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఓటర్ల జాబితాలు, ఓటు హక్కుకు సంబంధించిన అంశాలపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఆందోళన**

ఓటు అనేది ప్రజాస్వామ్యంలో సామాన్యుడికి లభించిన అత్యంత శక్తివంతమైన హక్కు అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, ఓటర్ల వివరాలకు సంబంధించిన అంశాల్లో పూర్తి పారదర్శకత ఉండాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా అనుమానాలు తలెత్తితే వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనని పేర్కొన్నారు.ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగానే కరీంనగర్‌లో కూడా ఈ ఆందోళన నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఇల్లందకుంట నుంచి భారీగా పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

ఈ నిరసన కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కనుమల్ల సంపత్, గూడెపు ఓదెలు, ఉప్పుల శ్రీనివాస్‌రెడ్డి, భోగం చిరంజీవి, భోగం సాయి, మూడేళ్ల రమేష్, బండి మల్లయ్య, గురుకుంట్ల స్వామి, ఆరే రమేష్‌రెడ్డి, ముష్కి కుమారస్వామి, బైరెడ్డి కొండల్‌రెడ్డి, కోడం రజిత, బొమ్మ శ్రీనివాస్ తదితరులు ఆందోళనలో పాల్గొని నిరసన తెలిపారు.కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని, ఓటర్ల హక్కులకు పూర్తి రక్షణ కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో నియామకాలు





**కరపత్రం ప్రతినిది, వేములవాడ**

కాంగ్రెస్ మైనార్టీ విభాగంలో కీలక నియామకాలు జరిగాయి. వేములవాడ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మహమ్మద్ అబ్దుల్ రజాక్, రాజన్న సిరిసిల్ల జిల్లా మైనార్టీ విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా మహమ్మద్ షాహీద్ పాషా నియమితులయ్యారు. సోమవారం సిరిసిల్లలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర నాయకులు వి. హనుమంతరావు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్ చేతుల మీదుగా వారు నియామక పత్రాలు అందుకున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు నియామకాలు జరిగినట్లు నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని